

చేపల పెంపకంతో అనేక లాభాలు : కలెక్టర్

రామారెడ్డి, ఫిబ్రవరి 29: రైతులు వ్యవసాయంతో పాటు చేపల పెంపకం చేపట్టి అనేక లాభాలు పొందాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. గురువారం మండలంలోని పోసానిపేటలో మహిళ రైతు లక్ష్మీ తన పొలంలో ఫిష్ పాండ్‌ను ఏర్పాటు చేసి చేపల పెంపకం చేపట్టడంతో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక పరిపుష్టిని సాధించాలని కోరారు. రైతు లక్ష్మీ చేపల పెంపకానికి పెట్టిన పెట్టుబడి వివరాలు, వచ్చిన ఆదాయం వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో చందర్, ఎంపీడీవో సవితారెడ్డి, డీపీఎం రమేష్‌బాబు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



జిల్లాలో 506 ఉపాధ్యాయ ఖాళీలు

- జిల్లాలో పెరిగిన ఉపాధ్యాయుల పోస్టులు
- ఈ సారి కొత్తగా స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు 47
- ఉపాధ్యాయ పోస్టులకు తీవ్ర పోటీ నెలకొననుంది
- మెగా డీఎస్సీ ప్రకటించిన ప్రభుత్వం
- రేపటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే అవకాశం
- పాత డీఎస్సీ షెడ్యూల్‌ను రద్దు చేసిన ప్రభుత్వం
- డీఎస్సీ కంటే ముందు టెట్ నిర్వహించేనా?

కామారెడ్డి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల కొలువుల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న నిరుద్యోగుల ఆశలు త్వరలోనే నెరవేరనున్నాయి. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీని ప్రకటించింది. దీంతో ఉపాధ్యాయ పోస్టుల కోసం పోటీ పడుతున్న నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో ఉపాధ్యాయ ఖాళీల పోస్టుల వివరాలను సైతం ప్రభుత్వం వెల్లడించింది. ఈసారి కొత్తగా స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను సైతం ప్రకటించింది. అయితే ఎన్నికల కన్న ముందు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. 11 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులతో తాజాగా మెగా డీఎస్సీని ప్రకటిస్తూ జీవో జారీ చేసింది. గతంలో డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవసరం లేదని ప్రకటించింది. దరఖాస్తు చేసుకోని వారు ఈనెల 2 నుంచి ఏప్రిల్ 2 వరకు అవకాశం కల్పించారు. అయితే డీఎస్సీ కన్నముందు టెట్ నిర్వహిస్తారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. కొత్త జిల్లాల వారీగానే పోస్టులను భర్తీ చేయనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

జిల్లాలో 506 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు

రాష్ట్రప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించింది. దీంతో పాటు జిల్లాలోని ఉపాధ్యాయ పోస్టుల వివరాలను సైతం వెల్లడించింది. మెగా డీఎస్సీ ద్వారా జిల్లాలో 506 ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. ఈసారి కొత్తగా స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను సైతం కేటాయించింది. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 121, లాంగ్వేజ్ పండిట్ పోస్టులు 15, పీఈటీ పోస్టులు 5, సెకండ్ గ్రేడ్ టీచర్ పోస్టులు 318, స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 11, స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌జీటీ పోస్టులు 36 కలుపుకొని మొత్తం 506 పోస్టులను భర్తీ చేయనుంది. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌తో పోలిస్తే ఈ సారి జిల్లాలో పోస్టుల సంఖ్య పెరిగింది. గత ప్రభుత్వం 200ల పోస్టులు ప్రకటించి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. కానీ ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా నిలిచిపోయాయి. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం పోస్టులను 506కు పెంచింది. అంతేకాకుండా తొలిసారిగా స్పెషల్ ఎడ్యుకేషన్ కింద 47 పోస్టులు మంజూరు చేసింది. ఈ పోస్టులు ఎస్‌ఏ, ఎస్‌జీటీ ఖాళీల్లోనే కలిపి చూపించారు. దీనికి ప్రత్యేక బీఈడీ పూర్తిచేసినవారు అర్హులవుతారు.

పాత డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు

2023 సెప్టెంబరులో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. పరీక్షల నిర్వహణకు షెడ్యూల్‌ను కూడా గత ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో వాయిదా పడింది. అయితే నిరుద్యోగ యువత అంతా గత డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారమే టీఆర్‌టీ నిర్వహిస్తుందని భావించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గత డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. కొత్త ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల పోస్టులను పెంచుతూ రాష్ట్రవ్యాప్తంగా 11,062 పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించింది. అయితే గతంలో డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవసరం లేదని ఆ దరఖాస్తుల ఆధారంగానే డీఎస్సీ పరీక్షలు రాయవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. అయితే దరఖాస్తు చేసుకోని వారు మార్చి 2 నుంచి ఏప్రిల్ 2వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

టెట్ నిర్వహించేనా?

కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా మెగా డీఎస్సీని ప్రకటించింది. అయితే టెట్ పరీక్ష రాసినవారే డీఎస్సీకి అర్హులు. చాలా మంది నిరుద్యోగులు టెట్ కోసం ఎదురుచూస్తున్నారు. మెగా డీఎస్సీ కంటే ముందు టెట్ నిర్వహించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. గతంలో టెట్ క్వాలిఫై అయిన వారికే ఈ డీఎస్సీ అవకాశం ఉంటుందా అనే దానిపై నిరుద్యోగుల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. డీఎస్సీ రాయాలంటే టెట్ క్వాలిఫికేషన్ తప్పనిసరి. దీంతో ఇప్పటి వరకు టెట్ క్వాలిఫై కానివారు తాజా డీఎస్సీకి అనర్హులవుతారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం డీఎస్సీ కంటే ముందు టెట్ నిర్వహిస్తుందో లేదో చూడాలి.

ఏజెన్సీ ప్రాంతాలకంటే..
జుక్కల్‌లో అభివృద్ధి నిల్

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



విజయ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

పెద్ద కొడప్‌గల్/బాన్సువాడ టౌన్ ఫిబ్రవరి 29: ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల కంటే జుక్కల్ అభివృద్ధిలో వెనుకబడి ఉందని కామారెడ్డి జిల్లా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ సంకల్ప యాత్రకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బీజేపీ విజయ సంకల్ప యాత్ర సంగారెడ్డి జిల్లా నుంచి జుక్కల్ నియోజక వర్గంలోని విఠల్‌వాడీ గ్రామం లతవద్ద ప్రవేశించింది. అక్కడి నుంచి బీజేపీ శ్రేణులు ర్యాలీతో విజయ సంకల్ప యాత్ర జుక్కల్ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా జుక్కల్ మండల కేంద్రంలో అంబే ద్కర్ చౌరస్తా వద్ద అలాగే బాన్సువాడలోని అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి బీజేపీ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. తాను రాష్ట్ర వ్యాప్తంగా విజయ సంకల్ప యాత్ర ప్రారంభం అయినప్పటి నుంచి ఇప్పటి వరకు 90 నియోజకవర్గాల్లో పర్యటించానన్నారు. ఈ రోజు సంగారెడ్డి జిల్లా నుంచి జుక్కల్ నియోజక వర్గానికి ఈ యాత్ర చేరుకుందని, అయితే ఏజన్సీ ప్రాంతాల్లో ఉన్న అభివృద్ధి జుక్కల్ నియోజకవర్గంలో లేదని విమర్శించారు. జుక్కల్ నియోజకవర్గంలో గతంలో ఎమ్మెల్యేలుగా పని చేసిన వారు తమ సొంత అభివృద్ధి చేసుకున్నారే తప్ప జుక్కల్ అభివృద్ధికి కృషి చేయలేదని విమర్శించారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా పని చేసిన ఒకతను ఇళ్లు కట్టుకోవడానికి పని చేస్తే, మరొకతను ఇతర ప్రాంతాలలో భూములు కొనుగోలు చేసుకోవడానికే పరిమితమయ్యారని విమర్శించారు. అంతే గాక జుక్కల్ ప్రాంతంలో ఎటువంటి సౌకర్యాల కల్పనకు కృషి చేయలేదని తెలిపారు. దీంతో పాటుగానే జహీరాబాద్ ఎంపీలుగా పని చేసిన షెట్కార్, బీబీ పాటిల్‌లు కూడా జుక్కల్ నియోజక వర్గానికి ఏం చేశారో జుక్కల్ ప్రజానికానికి చెప్పాలని డిమాండ్ చేశారు. 7 నియోజక వర్గాల్లో ఇప్పటికీ బీబీ పాటిల్ సరిగ్గా ప్రజలకు తెలియదంటే పాటిల్ పాలన ఎలా ఉందో అర్థమవుతుందని తెలిపారు. ఇక తెలంగాణ రాష్ట్రంలో 6 గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేడు హామీల అమలులో విఫలం అయిందని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు అన్ని ఫ్రీ అని చెప్పిన కాంగ్రెస్ నేడు ఆ హామీల అమలుకు కండీషన్లు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో ఉన్న బీఆర్‌ఎస్ పాలన మాదిరిగానే కాంగ్రెస్ పాలన కొత్తది రాలే పాతది పోలే అన్న చందంగా తయారైందని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ అప్పు 7 లక్షల కోట్లు ఉంటే కాంగ్రెస్ పాలన 6 గ్యారెంటీల అమలుకు 9 లక్షల కోట్ల అప్పు చేస్తుందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. ఇక పార్టీలతో పని లేకుండా ప్రాంతాల వారీగా మోదీ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశాడని తెలిపారు. అందులో భాగంగానే జుక్కల్ నియోజకవర్గానికి 4 వరుసల రహదారి, జహీరాబాద్‌కు ఎయిమ్స్ కళాశాల, రెండు లైన్ల రైల్వే విద్యుత్ ఇచ్చారని తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కామారెడ్డి జిల్లా బీజేపీ కార్యకర్తలు ఇద్దరూ సీఎంలకు ఓడించే విధంగా చేశారని, జహీరాబాద్ బీజేపీ కార్యకర్తలు అనుకుంటే జహీరాబాద్ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని తెలిపారు. ప్రజలు కూడా తెలివైన నిర్ణయం తీసుకుని పనిచేసే వారినే గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు అరుణతార, బీజేపీ నాయకులు బద్దం మహిపాల్ రెడ్డి, సుభాష్ రెడ్డి, ఆలే భాస్కర్, జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులకు
అదనపు బాధ్యతల భారం

- ప్రత్యేక అధికారులు సతమతం
- ఒక్కో అధికారికి రెండేసి గ్రామ పంచాయతీలు
- డిజిటల్ సిగ్నేచర్ జారీలో జాప్యం
- 15వ ఆర్థిక సంఘం నిధులకు అడ్డంకి



ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 29: గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు అదనపు బాధ్యతలతో ఆందోళన చెందుతున్నారు. ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామ పంచాయతీల బాధ్యతలను అప్పగించడంతో ప్రత్యేక పాలన సక్రమంగా ముందుకు సాగలేని పరిస్థితి నెలకొంది. ఒక పంచాయతీకి పోతే మరో పంచాయతీకి వెళ్లే సరికే సమయం గడిచిపోతోందని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. సర్పంచ్‌ల పదవి కాలం ఈనెల 1న ముగియడంతో ప్రభుత్వం గెజిటెడ్ స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. ఈనెల 7 నుంచి 15 వరకు జరిగిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శుల సహకారంతో నిర్వహించారు. కామారెడ్డి జిల్లాలో మొత్తం 526 గ్రామ పంచాయతీలుండగా ప్రత్యేక అధికారులుగా నియమితులైన ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు అదనపు బాధ్యతలతో సతమతమవుతున్నారు. తమ సొంత శాఖతో పాటు తమకు కేటాయించిన గ్రామాల బాధ్యతలను నిర్వహిస్తున్నారు. సర్పంచ్‌లకు ఉండే బాధ్యతలను నిర్వహిస్తున్నారు. సర్పంచ్‌లకు ఉండే బాధ్యతలను అధికారులకు అప్పగించడంతో ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, ఇంటి పన్నుల వసూళ్లు తదితర బాధ్యతలతో పాటు సొంత శాఖ పనులను చేసుకోలేక ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్లకు ప్రతిరోజూ భూముల రిజిస్ట్రేషన్ చేయాల్సిన పని ఉంటుంది. ఈ బాధ్యత ఇతరులకు అప్పగిస్తే అక్రమాలు జరిగే అవకాశముండటంతో తప్పనిసరిగా తహసీల్దార్లు కార్యాలయంలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బదిలీ

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక అధికారులుగా ఉన్న ఎంపీడీవోలు, తహసీల్దార్లను ఇటీవలే బదిలీ చేయడంతో పంచాయతీ పాలనపై ప్రభావం పడింది. కొత్తగా వచ్చిన అధికారులు మళ్లీ పంచాయతీ కార్యదర్శులతో కలిసి బ్యాంకు ఖాతాలు, చెక్ పవర్ తదితర అంశాలను చేయాల్సి వచ్చింది. అంతేకాకుండా సొంత నియోజకవర్గాలకు చెందిన అధికారులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాలనే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మరికొంత మంది ఎంపీడీవోలు, తహసీల్దార్లను బదిలీ చేసే అవకాశముంది. ఈ వారంలో మళ్లీ ప్రత్యేక అధికారుల బదిలీలుంటాయని పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు. ఈనెల 15న పంచాయతీ కార్యదర్శులతో కలిసి ప్రత్యేక అధికారులకు ప్రభుత్వం జాయింట్ చెక్ పవర్ సౌకర్యం కల్పించింది. అయితే డిజిటల్ సిగ్నేచర్‌కి జారీ చేయకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లెల్లో ప్రత్యేక పాలన నిర్వహిస్తున్నాం

● ప్రకాష్, ఎంపీవో, ఎల్లారెడ్డి



ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లెల్లో ప్రత్యేక పాలన నిర్వహిస్తున్నాం. మాకు కేటాయించిన గ్రామాలల్లో నిత్యం పర్యటిస్తున్నాం. ప్రజా సమస్యలపై ఆరా తీసి వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం. పెండింగ్ బిల్లులపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తున్నాం.

బీజేపీ వైపు బీబీ పాటిల్?

- ఈనెల 5న సంగారెడ్డి సభలో చేరే అవకాశం
- జహీరాబాద్ టికెట్‌కై పాటిల్ మంతనాలు
- గ్యారెంటీ ఇవ్వలేమన్న బీజేపీ రాష్ట్ర నేతలు
- మహారాష్ట్రలోనైనా ఎంపీ టికెట్ కోసం పాటిల్ ఢిల్లీ పెద్దలతో చర్చలు

కామారెడ్డి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది బీఆర్‌ఎస్‌లోని పలువురు ముఖ్యనేతలు బీజేపీ, కాంగ్రెస్‌లోకి చేరుతున్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో ఉంటే రాజకీయ మనుగడ ఉండదనే భావనతో పలువురు ప్రజాప్రతినిధులతో పాటు ముఖ్యనేతలు కాంగ్రెస్, బీజేపీలకు క్యూ కడుతున్నారు. అయితే జహీరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీ వైపు చూస్తున్నట్లు సమాచారం. బీజేపీలో చేరేందుకు ఆ పార్టీ రాష్ట్ర ముఖ్యనాయకులతో పాటు ఢిల్లీ నేతలతో పాటిల్ చర్చలు జరిపినట్లు ఇటు బీజేపీతో పాటు బీఆర్‌ఎస్‌లోనూ జోరుగా చర్చ సాగుతోంది. త్వరలోనే బీబీ పాటిల్ బీజేపీలో చేరే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెలలో రాష్ట్రంలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటనలు ఖరారయ్యాయి. ఈనెల 5న సంగారెడ్డి జిల్లాలో ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలను కలుపుతూ మోదీ బహిరంగసభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. సంగారెడ్డి సభలోనే బీఆర్‌ఎస్ ఎంపీ బీబీ పాటిల్ మోదీ సమక్షంలో చేరుతారని ఆయన అనుచర వర్గాల్లో చర్చ సాగుతుంది. దీనిపై ఎంపీ బీబీ పాటిల్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

బీఆర్‌ఎస్‌లో గుర్తింపు లేదని

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ తరపున బీబీ పాటిల్ రెండు పర్యాయాలుగా ఎన్నికయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రం ఏర్పడడం, టీఆర్‌ఎస్‌కు అనుకూల పరిస్థితులు ఉండడంతో ఉద్యమం నేపథ్యంలో బీబీ పాటిల్‌ను 2014లో టీఆర్‌ఎస్ తరపున మొదటి సారిగా ఎంపీగా ఎన్నికయ్యారు. 2018 సాధారణ లోక్‌సభ ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ నుంచే పాటిల్ బరిలో దిగారు. సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్‌రావుపై స్వల్ప ఓట్లతో పాటిల్ రెండో సారి విజయం సాధించారు. అయితే పాటిల్ రెండు పర్యాయాలుగా ఎంపీగా గెలుపొందినప్పటికీ పార్లమెంట్ పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తనకు పూర్తిస్థాయిలో సహకరించలేదనే వాదన ఆ పార్టీ వర్గాల్లో ఉంది. ఒకానొక సమయంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎంపీ బీబీ పాటిల్‌ను బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు అడుగు పెట్టనివ్వలేదనే వాదన పాటిల్ అనుచర వర్గాల్లోనూ ఉంది. ఈ నేపథ్యంలో ఎంపీ బీబీ పాటిల్, మాజీ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల మధ్య అఘాతం పెరుగుతూ వచ్చింది. అయితే ప్రస్తుతం బీఆర్‌ఎస్ అధికారం కోల్పోవడం ప్రజల్లో ఆ పార్టీకి ఆదరణ లేకపోవడం జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఇద్దరు మాత్రమే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉండడం లాంటి పరిస్థితుల్లో పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచే అవకాశాలు ఉండవని ఎంపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన అనుచరులు సైతం పార్టీ మారాలంటూ ఎంపీపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఎంపీ బీబీ పాటిల్ పార్టీ మారేందుకు ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

బీజేపీ ఎంపీ టికెట్ కోసం ప్రయత్నం

బీఆర్‌ఎస్ నేత జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ సీటు కోసం ఆయన బీజేపీ అధిష్ఠానంతో మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. అయితే టికెట్ విషయంలో గ్యారెంటీ ఇవ్వలేమని కమల పార్టీ రాష్ట్ర నేతలు ఆయనకు చెప్పారని చర్చలు సఫలం అయితే ఆయన బీజేపీలో చేరుతారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే జహీరాబాద్ బీజేపీ ఎంపీ టికెట్ కోసం పార్లమెంట్ పరిధిలో సుమారు 15 మందికిపైగా ఆశావహులు పోటీ పడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కువగా డిమాండ్ ఉన్న ఎంపీ సీటు బీజేపీ నుంచి జహీరాబాద్ స్థానమేనని ఆ పార్టీ వర్గాలు సైతం చెబుతున్నాయి. అయితే బీఆర్‌ఎస్ ఎంపీ బీబీ పాటిల్ సైతం తనకు టికెట్ ఇస్తే పార్టీలో చేరుతానని బీజేపీ పెద్దలకు చెప్పినట్లు సమాచారం. జహీరాబాద్ టికెట్ కాకుంటే మహారాష్ట్రలోంచి ఎక్కడో ఓ చోట ఎంపీ స్థానం నుంచి టికెట్ కావాలని బీబీ పాటిల్ ఆశిస్తున్నట్లు ఢిల్లీ పెద్దలతోనూ చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది.



జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్

'రుణాలను సకాలంలో చెల్లించాలి'

మోపాల్, ఫిబ్రవరి 29: మహిళా సంఘాలు బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని మండల సమైక్య ఏపీఎం మోహన్ మహిళా సంఘాలకు సూచించారు. గురువారం మోపాల్ మండల సమైక్య సమావేశం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలు బ్యాంకు నుంచి తీసుకున్న 37.55 కోట్ల రూపాయలు తీసుకుంటే ఇప్పటి వరకు 35కోట్లు రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. మరో 2.55 కోట్లు మార్చి చివరిలోగా అనుకున్న లక్ష్యాన్ని సాధించుకునే విధంగా సంఘాలు కృషి చేయాలని కోరారు. బ్యాంకులోను తీసుకున్న మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. మార్చి చివరిలోగా వంద శాతం రికవరీ అయ్యే విధంగా సంఘ సభ్యులందరూ భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో 29 సంఘాల ప్రతినిధులు, పాలకవర్గం సభ్యులు, సీసీలు, ఎంఎస్ సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని అర్గుల్ గ్రామంలో గురువారం శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి జాతర, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మొదట యజ్ఞం నిర్వహించి బలిప్రదానం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరై రథోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అంతేకాకుండా వేదపండితులు ఆశ్చర్యతేజ చక్రవర్తుల ఆధ్వర్యంలో స్వామివారి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ గోర్త పద్మ, మాజీఉపసర్పంచ్ గోర్త రాజేందర్, ఎంపీటీసీ అనిత, వీడీసీ చైర్మన్ రాజారెడ్డి, కోశాధికారి మురళి, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన నుడా డైరెక్టర్

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 29: రూరల్ మండలం కాలూరుకు చెందిన బీఆర్ఎస్ నేతలు బీజేపీ పార్టీలో చేరారు. గురువారం సారంగపూర్‌లోని చక్కెర కర్మాగారం వద్ద జరిగిన కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సమక్షంలో నుడా డైరెక్టర్ ముష్క సంతోష్ నేతృత్వంలో 30 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాషాయజెండా కప్పుకున్నారు. వీరిని ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్‌లు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నుడా డైరెక్టర్, కాలూరు వాసి ముష్క సంతోష్ తెలంగాణ మలిదశ ఉద్యమం తొలి రోజుల నుంచి పార్టీకోసం పనిచేశారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు ముష్క సంతోష్ అత్యంత సన్నిహితుడు కావడం విశేషం. ముష్క సంతోష్ తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు పల్లెగంగారెడ్డి, పద్మారెడ్డి, ఒంటెల శంకర్ రెడ్డి, దాసరి అరుణ్‌కుమార్, తిర్మన్‌పల్లి దిలావర్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నేతలకు పార్టీ కండువా కప్పుతున్న ధన్‌పాల్



బాల్కొండలో నువ్వు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి మహేంధర్‌రెడ్డి

'నువ్వు పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'

ముప్కాల్, ఫిబ్రవరి 29: బాల్కొండ మండల కేంద్రంలో నువ్వు పంటకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గురువారం మండల వ్యవసాయాధికారి మహేంధర్‌రెడ్డి రైతులకు సూచించారు. నువ్వు పంటకు ఆకుముడుత, గోంగళి పురుగు, పత్రహరితాన్నిగీకి తినడం వల్ల ఎగుదుదల ఆగిపోతుందని దిగుబడి తగ్గిపోతుందని అన్నారు. ఇమామేక్టిన్, బెంజాయేట్ 100గ్రాములు, క్లోరాంతర నిలిప్రోలు 60ఎంఎల్ ఎకరానికి ఒకదానికి 200లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేయాలని ఆయన సూచించారు. రసం పీల్చే పురుగులైన తామర నల్లిపేను ఆకులో అడుగుభాగం నుంచి రసం పీల్చడం వల్ల ఆకులు పాలిపోయి ఎదుగుదల లోపిస్తుందని, నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 100ఎంఎల్, డైమితయేట్ 400ఎంఎల్, దయోమితాక్సమ్ 80గ్రాములు ఒక దానిని 200లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేయాలని వివరించారు.

అర్గుల్‌లో 'లగ్గం' షూటింగ్

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని అర్గుల్ గ్రామంలో గురువారం లగ్గం సినిమా షూటింగ్ చిత్రీకరించారు. గ్రామంలోని మైనారిటీ గుట్టపై సినిమా సెట్టింగ్ వేసి హీరోయిన్‌పై కొన్ని సన్నివేశాలను, పాటలను చిత్రీకరించారు. అనంతరం రైతు బోర్ర నర్సారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో హీరోయిని చిన్నారులతో కూడిన పాటను చిత్రీకరించారు. సాయంత్రం గ్రామంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం జాతరలో లగ్గం సినిమా షూటింగ్ తీశారు. ఈ సినిమా షూటింగ్ తీస్తున్నారని తెలుసుకున్న అర్గుల్ గ్రామస్థులతో పాటు చుట్టు పక్కల గ్రామాల తరలివచ్చి తిలకించారు.



హీరోపై సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించాలి

ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు డిమాండ్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 29: నిజామాబాద్ జిల్లాలో గల చక్కెల ఫ్యాక్టరీలను ప్రభుత్వం తెరిపించాలని ఎన్సీఎస్ఎఫ్ సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించి రైతులను ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూరి భూమయ్య డిమాండ్ చేశారు. గురువారం డిచ్‌పల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఇచ్చిన హామీ మేరకు నిజాంషుగర్ ఫ్యాక్టరీని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో సబ్ కమిటీ వేశారని ఎన్‌సీఎస్ఎఫ్ ఫ్యాక్టరీ దానిలో లేకపోవడాన్ని తాము విభేదిస్తునమన్నారు. ఎన్‌సీఎస్ఎఫ్‌తో పాటు సారంగాపూర్ కూడా ఈప్రాంత రైతులు తెలంగాణలో ఉన్నారని ఈ ఫ్యాక్టరీని కూడా సబ్ కమిటీలో చేర్చాలన్నారు. అధికారంలోకి వస్తే 100రోజుల్లో ఫ్యాక్టరీని తెరిపిస్తామని చెప్పి బీఆర్ఎస్ మోసం చేసిందన్నారు. అందుకే రైతులకు ఆపార్టీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. జిల్లాలోని చక్కెర ఫ్యాక్టరీలను ప్రభుత్వం తెరిపించి నడిపించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు సాయిరెడ్డి, దేవ స్వామి, సాయినాథ్ పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో రెజ్లర్ నేహాబేగంకు సన్మానం

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 29: రూరల్ మండలం రాంనగర్‌కు చెందిన రెజ్లర్ నేహాబేగం జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచిపేరు తేవాలని బీఆర్ఎస్ నేతలు ఆకాంక్షించారు. గురువారం సారంగపూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రెజ్లర్ నేహాబేగంను మైనార్టీ అధ్యక్షుడు అక్బర్‌నవాజుద్దీన్ ఘనంగా సన్మానించాడు. రాంనగర్‌కు చెందిన నేహాబేగం ఆర్మూర్ మైనార్టీ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. చదువుతో పాటు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో రెజ్లర్‌గా బహుమతులు పొందింది. కడు పేదరికంలో పుట్టిన నేహాబేగం చదువులో ముందుండి, రెజ్లింగ్‌లో కూడా శిక్షణ పొందింది. వరంగల్‌లో జరిగిన తెలంగాణ స్టేట్ లెవెల్ అండర్ 15 రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని గోల్డుమెడల్ పొంది జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందింది. పంజాబ్‌లో త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతున్నట్లు తెలిపింది. పేదరికంలో ఉన్న నేహాబేగం కుటుంబాన్ని తనతోపాటు తన మిత్రబృందం ఆర్థిక సహాయం చేస్తున్నట్లు అక్బర్‌నవాజుద్దీన్ తెలిపారు. ఈకార్యక్రమంలో అప్సర్ ఖాన్, నర్సాగౌడ్, రాజు, వాహిద్‌అలీ, అంజు, బి.అశోక్ తదితరులున్నారు.

ఘనంగా మండేలేశ్వర స్వామి విగ్రహప్రతిష్ఠాపన



మండేలేశ్వర స్వామి విగ్రహప్రతిష్ఠలో పాల్గొన్న రజక సంఘ సభ్యులు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 29: రజకుల ఆరాధ్యదైవం మండేలేశ్వర స్వామి విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రజక సంఘ సభ్యుడు గ్రామ శివారులోని కుడిగుంట సమీపంలో ఇటీవలే నూతనంగా మండేలేశ్వర స్వామి నూతన ఆలయాన్ని నిర్మించుకున్నారు. కాగా గత మూడు రోజులుగా విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉత్సవమూర్తులను మేళతాళాలు డప్పువాయిద్యాలు బోనాలు, మంగళహారతుల మధ్య ఊరేగింపుగా నూతన ఆలయానికి చేర్చారు. కాగా గురువారం గ్రామ అర్చకులు కప్పగంటి రమేష్ చంద్ర శాస్త్రి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛానల మధ్య ప్రత్యేక పూ.లఅనంతరం విగ్రహ ప్రతిష్ఠాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసత్రం నిర్వహించగా మండలంలోని రజక సంఘాల సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి కట్నకానుకలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు ఆవుట్ల బాజన్న, కోశాధికారి సుంకెట నర్సయ్య, సుంకెట గంగాధర్, బాజన్న, సుంకెట శ్రీనివాస్, రవి, దశరత్, సుంకెట రమేష్, సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ధర్పల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని రేకులపల్లి గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి గురువారం తెలిపారు. రేకులపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు గ్రామానికి వెళ్లి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన తెలిపారు.

శవ పేటిక అందజేత

రుద్రూరు, ఫిబ్రవరి 29: రుద్రూరు మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూరు శ్యామ్‌సుందర్ పహాడే సహకారంతో గ్రామ కమిటీ వారికి శవ పేటికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సావిత్రి లింగం బాపూజీ, లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూరు కోశాధికారి లయన్ కె.వి. మోహన్ , ఎర్రోళ్ల సురేందర్, సంతోష్, గ్రామ ప్రత్యేక అధికారి డాక్టర్ సంతోష్‌కుమార్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

కోటగిరి,ఫిబ్రవరి29: కోటగిరి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు అభయహస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ బర్ల గంగారాం సహకారంతో ఆయన తనయుడు బర్ల మధు విద్యార్థులకు పరీక్ష అట్టలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, నాయకులు బర్ల రవి, కూచి శ్రీనివాస్, సత్యనారాయణ, సాయిలు, సలీం తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ ప్రధానకాల్వలో శవమైంది

నిజాంసాగర్, ఫిబ్రవరి 29 : బుధవారం అదృశ్యమైన గురువారం శవమై తేలింది. ఎల్లారెడ్డి మండలం గండి మాసానిపేట్‌కు చెందిన శిరీష (38) అనే మహిళ బుధవారం ఇంటి నుంచి బయలు దేరి నిజాంసాగర్ మండలం గాలిపూర్ వద్ద 3సంవత్సరాల కుమారున్ని వదిలికాల్వలో దూకింది. కుటుంబ సభ్యులు వివాహిత మహిళ అదృశ్యమైనట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు శిరీష కుమారున్ని రోడ్డుపై ఎందుకు వదిలింది, వదిలినీటిలో దూకిందా అని విచారణ జరిపారు. మృతదేహం నిజాంసాగర్ ప్రధానకాల్వలోని డిస్ట్రిబ్యూటర్ 9(ఎ) మధ్య మృతదేహం ఉండటంతో పశువుల కాపర్లు పోలీసులకు సమాచారం అందజేశారు. నిజాంసాగర్ ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భర్త సతీష్ శవాన్ని శిరీషదే అని గుర్తించారు. ప్రధానకాల్వలో దూకి ఆత్మహత్య చేసుకోవడం పట్ల భర్త పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఎస్సై సుధాకర్ తెలిపారు. శిరీష అదృశ్యమైన కేసు ఆత్మహత్యగా పరిగణలోకి తీసుకోవడమే కాకుండా భర్తను విచారిస్తున్నట్లు తెలిపారు.

క్యారమ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 29:తెలంగాణ క్యారమ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా క్యాతం సంతోష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ క్యారమ్స్ అసోసియేషన్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సంతోష్‌కుమార్ రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాకు చెందిన సంతోష్‌కుమార్ గత కొన్ని సంవత్సరాలుగా జిల్లా అసోసియేషన్ అధ్యక్షునిగా కొనసాగారు. నూతనంగా ఎన్నికైన సంతోష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షునిగా తనపై ఉంచిన నమ్మకాన్ని సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. జిల్లాలో తెలంగాణలో క్యారమ్ క్రీడాకారుల అభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు. క్యారమ్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన సంతోష్‌ను ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈగ సంజీవ్‌రెడ్డి, బొబ్బిలి నర్సయ్య, వివిధ క్రీడా సంఘాల నాయకులు లింగయ్య, సాయాగౌడ్, సుబ్బారావు, విద్యాసాగర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, గోపిరెడ్డి, అజ్మత్, మీసాల ప్రశాంత్‌లు హర్షం వ్యక్తం చేశారు.

మండుతున్న ఎండలు..ఎండుతున్న గొంతులు

● బట్టితండా, బానవత్ తండా, కిషన్‌తండాల్లో తాగడానికి నీళ్లు దొరకని పరిస్థితి ● వ్యవసాయ బావులనుంచి తెచ్చుకుంటున్న మహిళలు ● పట్టించుకోని అధికారులు



వ్యవసాయ పొలం వద్ద నీళ్లు పట్టుకుంటున్న గిరిజనులు

సిరికొండ ఫిబ్రవరి 29: రోజు రోజుకు ఎండలు ఒకవైపు మండుతున్నాయి, మరోక వైపు తాగడానికి నీళ్లందక గొంతులు ఎండుతున్నాయని గిరిజనుల ఆందోళన చెందుతున్నారు. సిరికొండ మండలంలోని పాకాల గ్రామ పంచాయతీ పరిధిలోని బట్టితండా, బానవత్ తండా, కిషన్‌తండాల్లో తాగడానికి నీళ్ల దొరక్క మహిళలు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి నీళ్ల తెచ్చుకుంటున్నారు. తండా ముందే మిషన్ భగీరథ ట్యాంకున్న అందులోకి నీళ్ల రాక తండా ప్రజలకు నీళ్లందడం లేదంటున్నారు. ముందున్న తండాలకు నీళ్ల రావు కాని మరోక తండాకు మాత్రం భగీరథ నీళ్ల వస్తున్నాయని గిరిజనులు చెపుతున్నారు. ఎండలు తీవ్రమవుతున్న నేపధ్యంలో గొంతు తడుపుందామంటే నీళ్ల లభించడం లేదంటున్నారు. ప్రభుత్వాలు ఆడబిడ్డలు ఇబ్బంది పడొద్దని ఇంటింటికి కుళాయి నీళ్ల అందిస్తున్నామని చెపుతున్న ఆచరణలో మాత్రం అందరికి భగీరథ నీళ్ల రావడం లేదని గిరిజనుల ఆవేదన బట్టి తెలుస్తోంది. ఎల్లవారు లేచింది మొదలు తాగు నీటి కోసం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కొన్ని సందర్భాల్లో గొంతు తడుపుకుందామంటే కూడ నీళ్ల లభించని దుస్థితి నెలకొన్నదన్నారు.కొత్త ప్రభుత్వమైన తమ తండాల ప్రజలకు నీళ్ల అందించడానికి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.తాగునీటి సమస్య ఉందని అధికారుల దృష్టికి తీసికెళ్లిన వారు మాత్రం చేసేదేమిలేదని చేతులెత్తేస్తున్నారని గిరిజన యువకులు,మహిళలు చెపుతున్నారు. తమ దగ్గర నిధులు లేవని నీటి సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని మండల అధికారులు చెపుతున్నారని తండాకు చెందిన యువకులు చెబుతున్నారు. ఉన్నాతాధికారులు స్పందించి తమకు తాగునీటిని అందించాలని తండాకు చెందిన మహిళలు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి రాహుల్, ప్రత్యేక అధికారి గంగారాంను ప్రశ్నించగా తాగు నీటి సమస్య ఉన్నమాట వాస్తమేనని అన్నారు.తండాల ప్రజలతో నీటి విషయమై చర్చించడం జరిగిందని పక్కా తండా వారిని నీటిని ఇచ్చే విధంగా ఒప్పించడం జరిగిందన్నారు. ఎంపీడీవోకు తాగునీటి సమస్య గురించి వివరించామని త్వరలోనే సమస్య పరిష్కారం అవుతోందని పంచాయతీ కార్యదర్శి రాహుల్ చెప్పారు.



బట్టి తండాలో వాటర్ ట్యాంక్

జలాల్‌పూర్‌లో మోటార్లు నడువడం లేదు

జలాల్‌పూర్‌లో మోటార్లు నడువడం లేదని అందువల్ల తండాకు మిషన్ భగీరథ నీళ్ల రావడం లేదని మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ శివ చెప్పారు.. పాకాలలో ఒకటి రెండు తండాల్లోనే తాగునీటి సమస్య ఉన్నట్లు తమ దృష్టికి ఆయన వచ్చిందన్నారు. ఒకటి రెండు రోజుల్లో సమస్య తీరిపోతుందన్నారు.

- మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ శివ

నేత్రానందం.. అనంత పద్మనాభుడి కల్యాణం

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 29: భక్తుల అనంత పద్మనాభ స్వామి నామస్మరణలు, మేళతళాల మధ్య అనంత పద్మనాభస్వామి కళ్యాణోత్సవం నేత్రానందంగా సాగింది. అమ్మవారిని, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఎదురెదురుగా కూర్చోబెట్టి వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య అర్చకులు కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మల్కాపూర్ (ఎ) గ్రామంలోని అనంత పద్మనాభస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా 3వ రోజైన గురువారం కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అర్చకులు మాకునూరి రమణాచార్య కళ్యాణంలోని ముఖ్య ఘట్టాలైన పాదప్రక్షాళన, మధుపర్కం, జలకరబెల్లం, కణ్యాధానం, మాంగళ్యసూత్రధారణ, మలాపరివర్తన,తలంబ్రాలు, బ్రహ్మముడిలను భక్తులకు చూపిస్తూ ఆధ్యాంతం భక్తిపారవశ్యంతో జరిపారు. భక్తులు కళ్యాణవేడుకలను చూస్తూ అనంతపద్మనాభస్వామి గోవిందా గోవిందా అంటూ తనయత్వంలో మునిగిపోయారు.



స్వామివారికి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

అనంతరం నిర్వహించిన మహా అన్నప్రసాదంలో పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మల్కాపూర్ (ఎ) గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌ను స్వాగతిస్తున్నాం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 29: కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో 11వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ ను స్వాగతిస్తున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయ నియామకాలను వేగంగా చేపట్టాలని తద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయ ని పేద మధ్యతరగతి విద్యార్థులకు ప్రయోజనం జరుగుతాయన్నారు. ఆలస్యమైనప్పటికీ ప్రభుత్వం ఎన్నో ఏళ్లుగా బీఈడీ, డీఈడీలను పూర్తి చేసి ఉద్యోగ ప్రకటనల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త చెప్పిందన్నారు.ఈవేసవిలో బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే విడుదల చేయాలని, నిలిచిపోయిన పదోన్నతులు, బదిలీలను వెంటనే పూర్తి చేయాలన్నారు. జీవో నంబర్ 317తో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులను ప్రభుత్వం సొంత జిల్లాలకు బదిలీ చేయాలని వారు కోరారు.

వ్యవసాయ డిగ్రీ కళాశాల మంజూరు అభినందనీయం

రుద్రూరు, ఫిబ్రవరి 29: రుద్రూరుకు నూతన వ్యవసాయ డిగ్రీ కళాశాల మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తంచేస్తూ గురువారం రుద్రూరు మండలంలోని ప్రాంతీయ చెరకు మరియు వరి పరిశోధన కేంద్రం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరి చంద్రశేఖర్, పార్టీ ఉపాధ్యక్షులు నడిపింటి నగేష్, తీగుళ్ల గంగామణి వరప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయాలి

రెంజల్,ఫిబ్రవరి29: మార్చి 3వ తారీఖు నుంచి 5వ తారీఖు వరకు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రెంజల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వినయ్ కుమార్ అన్నారు. గురువారం ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షహీత ఫిర్దోస్, డాక్టర్ ప్రమోదిత, ఉజ్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి29: పట్టణంలోని సికెన్వెన్షన్ హాల్‌లో డివిజన్ స్థాయి ఆరోగ్య సిబ్బందికి గురువారం జిల్లా ఇమ్యూనేషన్ అధికారిణి డాక్టర్ అశోక్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్ ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య సేవలు అన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వివిధ రకాల వ్యాధుల పట్ల సిబ్బందికి శిక్షణను అందించారు. అలాగే ఎయిడ్స్ వ్యాధి ఒక అంటు వ్యాధి అని దీని పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌స్థాయి ఆరోగ్య శాఖ సిబ్బంది, సూపర్‌వైజర్‌లు, డాటా ఎంటీ ఆపరేటర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు డొంకేశ్వర్ పీఏసీఎస్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం

డొంకేశ్వర్, ఫిబ్రవరి29: డొంకేశ్వర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్‌చైర్మన్ రాజారెడ్డిపై శుక్రవారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. ఇటీవల సొసైటీ డైరెక్టర్‌లు వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం కోరుతూ డీసీవోకు వినతిపత్రం అందజేశారు. ఏడుగురు డైరెక్టర్‌లు సంతకాలు చేసినట్టు తెలిసింది. అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం సొసైటీ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస పరీక్ష జరగనుంది.

షాపుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

ఇందల్వాయి, ఫిబ్రవరి 29: ఫర్టిలైజర్ షాపుల వివరాలను ఖచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఏవో ప్రవీణ్‌కుమార్ ఇందల్వాయి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల యజమానులకు గురువారం అవగాహన కల్పించారు. షాపులో ఎప్పటి నుంచి ప్రారంభమయ్యాయి, ఏఏ మందులను విక్రయిస్తున్నారో వాటి వివరాలను ప్రతీది ఆన్‌లైన్‌లో నమోదు చేసి తక్షణమే ప్రతీ ఒక్కరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులను విక్రయించాలని అన్నారు. అధిక ధరలకు అమ్మొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో యజమానులు నర్సయ్య, కల్యాణ్, రవి, తదితరులు ఉన్నారు.

నిజామాబాద్‌లో పసువు ధర రూ.15.25

ఖిల్లా, ఫిబ్రవరి 29: నిజామాబాద్ మార్కెట్‌లో పసుపునకు రోజురోజుకు ధర పెరుగుతుంది. మార్కెట్‌కు గురువారం పసుపు తీసుకువచ్చిన బద్దం సంతోష్ అనే రైతు పసుపుకు క్వింటాలు 15వేల 25 రూపాయలు ధర పలికింది. ఈ మార్కెట్‌కు గురువారం మొత్తం 7,500 క్వింటాలు పసుపు అమ్మకానికి వచ్చింది. సరాసరి ధర క్వింటాలుకు 14వేల 611 రూపాయలు ధర పలికింది. సంతోష్ క్వింటాల్‌న్నర పసుపు తీసుకురాగా ఆయన ఒక్కడికి మాత్రమే ఈ ధర వచ్చింది. మిగతా రైతుల పసుపు క్వింటాలుకు 8వేల నుంచి 11వేల 500 మధ్యనే ఎక్కువగా అమ్మకాలు జరిగింది. కొద్దిమంది రైతులకు మాత్రం 14వేల 611 రూపాయల వరకు ధర వచ్చింది. మార్కెట్‌లో సరాసరి మోడల్ రేటు ప్రకారం ధర వస్తుందని కార్యదర్శి వెంకటేశం తెలిపారు. ఒక్క రైతుకు మాత్రమే ఈ ధర పెట్టారని ఆయన తెలిపారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

మోపాల్, ఫిబ్రవరి 29: మహిళా సంఘాలు బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని మండల సమైక్య ఏపీఎం మోహన్ మహిళా సంఘాలకు సూచించారు. గురువారం మోపాల్ మండల సమైక్య సమావేశం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలు బ్యాంకు నుంచి తీసుకున్న 37.55 కోట్ల రూపాయలు తీసుకుంటే ఇప్పటి వరకు 35కోట్లు రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. మరో 2.55 కోట్లు మార్చి చివరిలోగా అనుకున్న లక్ష్యాన్ని సాధించుకునే విధంగా సంఘాలు కృషి చేయాలని కోరారు. బ్యాంకులోను తీసుకున్న మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. మార్చి చివరిలోగా వంద శాతం రికవరీ అయ్యే విధంగా సంఘ సభ్యులందరూ భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో 29 సంఘాల ప్రతినిధులు, పాలక వర్గం సభ్యులు, సీసీలు, ఎంఎస్ సీసీలు, తదితరులు పాల్గొన్నారు.



మండల సమైక్య సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

భార్య గొంతు నులిమి హత్య చేసిన భర్త

● ఆత్మహత్యగా చిత్రీకరణ ● భర్త, అత్తమామ, ఆడపడుచు జైలు శిక్ష

ముప్కాల్, ఫిబ్రవరి29: కట్టుకున్న భర్తే కాలయముడై భార్య గొంతు నులిమి హత్య చేసి ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించి చివరికి కటకటాల్లోకి వెళ్లిన ఘటన బాల్కొండలో వెలుగు చూసింది. బాల్కొండ మండల కేంద్రంలో బుధవారం అత్తింటి వేధింపులకు బలైన దర్మాయి లావణ్య మృతిపై. గురువారం బాల్కొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీధర్ ఎస్సై గోపితో కలిసి వివరాలు వెల్లడించారు. 15ఏళ్ళ క్రితం దర్మాయి రాజేందర్ లావణ్యకు వివాహం జరిగింది. అప్పటి వరకు సాఫీగా జరిగిన వారి కాపురం ఏడాది తర్వాత గోడవలు ప్రారంభమయ్యాయయి. దీంతో అత్తింటి వారు లావణ్యపై కేసులు పెట్టారు. ఈ క్రమంలో కేసు మాఫీ చేసేందుకు రాజేందర్ మృతురాలి తండ్రి వద్ద నుంచి రూ.2లక్షలు సైతం తీసుకున్నారు. కోర్టు కేసుల విషయంలో గొడవలు తారాస్థాయికి చేరాయి. తరచు భర్త రాజేందర్ అత్త గంగు, మామ లింగన్న, ఆడపడుచు వేదిని వేదిస్తున్నారు. ఈనెల 28న లావణ్య రాజేందర్ మధ్య జరిగిన గొడవలో చనిపోవాలని లావణ్యను రాజేందర్ కోరాడు. దీంతో సూసైడ్ నోట్ రాసిన కొన్ని గంటల్లో ఎవరు లేని సమయంలో లావణ్య గొంతుకు టవల్తో బిగించి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు చిత్రీకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు రాజేందర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్టు పేర్కొన్నారు. లావణ్యను మానసికంగా శారీరకంగా చిత్రీహింసకు గురి చేసిన భర్త, అత్తమామ, ఆడపడుచులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్, ఎస్సై గోపి

కేంద్రం కార్మిక చట్టాలను కాలరాస్తోంది

● ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జేపీ గంగాధర్



బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న కార్మికులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 29: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం బీడీ వర్కర్స్ యూనియన్ కార్మికుల పొట్ట కొట్టేలా కార్మికుల చట్టాలను కాలరాస్తున్నరని ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జేపీ గంగాధర్ డిమాండ్ అన్నారు. గురువారం తెలంగాణ ప్రగతి శీల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. కార్మిక చట్టాలను హరించి వేస్తున్నరని కార్మికుల హక్కులను కాలరాస్తున్నరని సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ ప్రభుత్వం చెప్పి విస్మరించిందన్నారు. కార్మికుల చట్టాలను సవరించలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయకార్యదర్శి సుప్రియ, లక్ష్మీ, పద్మ, గంగామణి, రాజమని, స్వప్న, పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు వెలకట్టలేనివి : సీడీపీవో

రెంజల్,ఫిబ్రవరి29: విధి నిర్వహణలో అంగన్‌వాడీల సేవలు వెల కట్టలేనివని సీడీపీవో జానకి అన్నారు. విధి నిర్వహణ పట్ల అంకిత భావం ప్రదర్శించినపుడే సరైన గుర్తింపు లభిస్తుందని అన్నారు. గురువారం మండల కేంద్రంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీడీపీవో జానకి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలా రాణిలు పిల్లల హైట్, వెయిట్ తీయడం జరిగింది. ఫిబ్రవరి 1నుండి 29వరకు పోషణ ట్రాకర్‌పై సర్వే యాప్ చేయడంపై అవగాహన కల్పించారు. పోషణ ట్రాకర్‌లో వందశాతం పేర్లు రిజిష్టర్ చేసిన వారికి సెలక్షన్ చేసి అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు ఆయాలకు అవార్డులు ప్రధానం చేశారు. నెల రోజులుగా పోషణ ట్రాకర్‌లో వందశాతం పూర్తి చేసిన వారిని గుర్తించి వారికి శాలువ, పూలమాలతో సత్కరించి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వినయ్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రావణ్ కుమార్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వన సంపద పెంచినప్పుడే అందరికి ఆదర్శం

మోర్తాడ్, ఫిబ్రవరి29: వన సంపద పెరిగినప్పుడు అందరికి సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మండల విద్యాధికారి ఆంధ్రయ్య అన్నారు. గురువారం మోర్తాడ్ బాలికల పాఠశాలలో మూడు మండలాలకు చెందిన విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవాల్లో భాగంగా ఉపన్యాస పోటీలు, జికె పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రయ్య మాట్లాడుతూ ప్రతీఒక్కరు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. అటవీ సంపద తగ్గుతున్న తరుణంలో దాని ప్రభావం మన జీవితాలపై పడుతుందని అందరికి ఆరోగ్య కలగాలంటే అడవులు పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వినోద్, శ్రీనివాసమూర్తి, మడు మండలాల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

రెంజల్,ఫిబ్రవరి29: వేసవికాలం దృష్ట్యా గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీడీవో శంకర్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులదేనని, గ్రామాలలో ఏర్పాటు చేసిన నర్సరీలలో గ్రీన్ నెట్‌లు ఏర్పాటు చేసి నర్సరీలో మొక్కలను సంరక్షించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లదేనని అన్నారు. నర్సరీల సంరక్షణతో పాటు మొక్కలను కాపాడాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనని సూచించారు. ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీవో గౌసోద్దీన్, ఏపీవో రమణ, ఈసీ,పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్ర ప్రారంభం

మెండోర, ఫిబ్రవరి29: మండల కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సీఎఫ్ఎల్‌ను గురువారం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ క్రాంతికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ప్రతీఒక్కరు ఆర్థిక అవగాహన కలిగి ఉండలని సోషల్ సెక్రిట్ స్కీములలో పీఎం ఎస్బీవై పీఎంజేజేబీవై ఏపివైలో చేరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాక్లూర్ సీఎఫ్ఎల్ కౌన్సిలర్ రవి, మెండోర సీఎఫ్ఎల్ కౌన్సిలర్ శ్రీనివాస్, ప్రసాద్, అరవింద్, ఎస్‌బీఐ సీఎస్పీ సంధ్యరాణి, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్ పాఠశాలలో విద్యార్థుల స్వయం పాలన

మోర్తాడ్, ఫిబ్రవరి29: మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై విద్యార్థులకు బోధించారు. విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలరాజు, ఉపాధ్యాయులు సంధ్యారాణి, శ్రావణి, సారిక, సీఆర్‌పీ సాయిరాం, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ కాలువలో పడి వ్యక్తి మృతి

కోటగిరి,ఫిబ్రవరి29: రుద్రూర్ మండలంలోని చిక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన హంగర్గ వీరన్న(65)అనే వ్యక్తి నిజాంసాగర్ కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. ఈ నెల 25వ తేదిన వీరన్న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. 26వ తేదిన నిజాంసాగర్ కాలువ పక్కన బట్టలు విడిచి నీటిలో దిగాడు. పారుతున్న నీటి ఉధృతికి వీరన్న కొట్టుకుపోయాడు. గురువారం వీరన్న మృతదేహం కోటగిరి గ్రామ శివారులోని నిజాంసాగర్ కాలువలో లభ్యమైందని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

నవీపేట,ఫిబ్రవరి29: నిజామాబాద్ మండలం పాల్దాకు చెందిన మరియా(60)అనే మహిళ బైక్ ఢీకొనడంతో మృతి చెందిందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. బుధవారం రాత్రి ఇంటి నుంచి దుకాణంలో పాల ప్యాకెట్ కొనడానికి వెళ్తుండగా నిజామాబాద్ నుంచి జన్నేపల్లికి వెళ్తున్న బైక్ వెనుక నుంచి ఢీకొనడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయని వెంటనే 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందని ఎస్ఐ తెలిపారు. మృతురాలి మేనల్లుడు ప్రేమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఆర్డీవో కార్యాలయ అధికారిణికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కేంద్రం రైతుల సమస్యలను పరిష్కరించాలి

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 29: కేంద్ర ప్రభుత్వం రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని అధికారిణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో రైతుల సమస్యలను పరిష్కరించాలని గత కొన్ని రోజులుగా రైతులు పోరాటం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతుల సమస్యలను పరిష్కరించి, న్యాయం చేకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నార్ల రాఘవేందర్, మధుసూదన్‌రెడ్డి, అక్బర్, సలీం తదితరులున్నారు.

ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 29: జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తెలుగు, సంస్కృతం, జీఎస్‌సీ-2 పరీక్ష కొనసాగిందని తెలిపారు. మొత్తం 7,375 మంది విద్యార్థులు పరీక్షకు హాజరావాల్సి ఉండగా 7,190 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ఎలాంటి మాల్‌ప్రాక్టిస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు.

నేడు విజయ సంకల్ప యాత్ర

గాంధారి, ఫిబ్రవరి 29: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర కొనసాగనుందని బీజేపీ మండల అధ్యక్షుడు సాయిబాబా తెలిపారు. శుక్రవారం గాంధారి మండల కేంద్రంలో రోడ్ షో కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కావున బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

జిల్లాలో 30 యాక్టు అమలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 29: జిల్లాలో 30 యాక్టు అమలులో ఉందని ఎస్పీ సింధూశర్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు ఈ యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించినా నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కావున జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు.

నీటిలో మునిగి ఒకరి మృతి

మాచారెడ్డి, ఫిబ్రవరి 29: పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట గ్రామానికి చెందిన మిరుదొడ్డి అనిల్(30)అనే వ్యక్తి గురువారం ఉదయం ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయినట్లు మాచారెడ్డి పోలీసులు తెలిపారు. గ్రామంలోని బండారి చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లాడు. బట్టలు ఉతకడం అయిపోయాక స్నానానికి నీటిలో దిగగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు వ్యక్తుల బైండోవర్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 29: రాత్రి పూట అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులు తెడ్ల నగేష్, మిట్టపల్లి బాబులను పట్టుకుని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను ప్రజలు పోలీసులకు తెలియజేయాలని కోరారు.

15 జీపీల్లో ఇంటి పన్నుల వసూలు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 29 : మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేసినట్లు మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు గాను 2023-24 ఆర్థిక సంవత్సరంకు గాను రూ.33లక్షల 17వేల 501 ఇంటి పన్నుల వసూలు చేసి లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.29 లక్షల 55వేల 123 వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని అక్కంపల్లి, ఆత్మకూర్, బంజారా తాండా, చీనూర్, గోలిలింగాల్, జప్తి జానకంపల్లి, లింగంపల్లి, మాటూర్, మెల్లకుంట తండా, పల్లెబోగడ తండా, రాఘవపల్లి, వెంకంపల్లి, వాడి, పోచారం, బెజ్జం చెరువు తండా గ్రామ పంచాయతీల్లో వందశాతం ఇంటి పన్నులు వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. మిగతా పది గ్రామ పంచాయతీల్లో ఈ నెలాఖరులోగా వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

సివిల్ రైట్స్ దినోత్సవం

సదాశివనగర్, ఫిబ్రవరి 29: మండలంలోని అమర్లబండలో సివిల్ రైట్స్‌డేను తహసీల్దార్ గంగాసాగర్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కుల, మతబేదాల వల్ల ఐక్యతను కోల్పోతున్నారని తెలిపారు. ఎలాంటి కుల వివక్ష లేకుండా ప్రజలందరూ కలిసిమెలిసి ఉంటూ గ్రామాలాభివృద్ధి కోసం కార్యాచరణ చేసుకుంటూ అభివృద్ధి చెందడానికి కృషి చేయాలన్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో హోటల్‌ల వద్ద దళితులను దూరంగా ఉంచడం, ఉత్సవాలలో వారికి సమన్యాయం కల్పించకపోవడంపై కుల వివక్ష జరుగుతుందని అన్నారు. ఇలాంటి సంఘటనల వల్ల ఐక్యత దెబ్బతినడం జరుగుతుందని ఇప్పటికైనా ప్రజలు ఇలాంటి వివక్షలు లేకుండా ఉండాలన్నారు.

నిజాంసాగర్: మండలంలోని వెల్లనూర్‌లో గురువారం సివిల్ రైట్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమేనన్నారు. చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు, ప్రజలు తదితరులున్నారు.



వెల్లనూరులో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- బస్సు డ్రైవర్ పరిస్థితి విషమం
- గాయపడిన పలువురు ప్రయాణికులు
- భిక్కనూరు మండలం బీటీఎస్ వద్ద సంఘటన

భిక్కనూరు, ఫిబ్రవరి 29: జాతీయ రహదారిపై మొక్కలకు నీరు పోస్తున్న జీఎంఆర్ వాటర్ ట్యాంకర్ లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గురువారం చోటు చేసుకుంది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జేబీఎస్ నుంచి నిర్మల్‌కు 54 మంది ప్రయాణికులతో వెళ్తున్న నిర్మల్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు భిక్కనూరు మండలంలోని బీటీఎస్ వద్ద ప్రతిరోజూ లాగానే జాతీయ రహదారిపై మొక్కలకు నీరుపోస్తున్న జీఎంఆర్‌కు చెందిన వాటర్ ట్యాంకర్‌ను వెనుకాల నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ గోపాల్ పరిస్థితి విషమయంగా ఉండగా, ఒక ప్రయాణికుడికి తీవ్ర గాయాలు కాగా మరో 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రంగా గాయపడిన బస్సు డ్రైవర్‌ను, గాయపడిన ప్రయాణికులను ఇతర వాహనదారులు, జీఎంఆర్, పోలీసు సిబ్బంది బయటకు తీసి వీరందరిని నాలుగు అంబులెన్స్‌లలో కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ప్రమాదంతో బస్సులోని ప్రయాణికులు భయంతో కన్నీరు పెట్టారు. ఈ ప్రమాదంతో రోడ్డుకు ఇరువైపుల వాహనాలు నిలిచిపోగా పోలీసులు బస్సును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కాగా ప్రమాద స్థలాన్ని భిక్కనూరు సీఐ సంపత్ పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.



ట్యాంకర్‌ను ఢీకొన్న సూపర్ లగ్జరీ బస్సు



బండాపల్లిలో తాగునీటి కోసం రోడ్డెక్కిన కాలనీవాసులు

బండాపల్లిలో ఖాళీ బిందెలతో నిరసన

పిట్లం, ఫిబ్రవరి 29: మండలంలోని బండాపల్లి గ్రామంలో గురువారం ఎస్సీ కాలనీవాసులు తమ కాలనీలో వారం రోజుల నుంచి తాగునీరు రావడం లేదని ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలిపారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తుగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని కాలనీవాసులు వాపోయారు. తమ సమస్య తీరకపోవడంతో రోడ్డెక్కి ఖాళీ బిందెలతో అధికారులకు తెలిసేలా నిరసన చేశామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని కాలనీవాసులు కోరారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ జితేష్ పాటిల్

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హేమచంద్ర, తహసీల్దార్ మహేందర్, అధికారులు పాల్గొన్నారు.

బాన్సువాడటౌన్: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఈ పరీక్షలకు గాను బాన్సువాడలో విద్యాశాఖాధికారులు మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రోజున జనరల్ విభాగంలో మొత్తం 1163 విద్యార్థులకుగాను 1137 మంది విద్యార్థులు హాజరు కాగా 26 మంది గైర్హాజరైనట్లు కస్టోడియన్ యాదగౌడ్ తెలిపారు. అదేవిధంగా వొకేషనల్ విభాగంలో 615 మంది విద్యార్థులకు 604 మంది హాజరు కాగా 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

సమయానికి రాని విద్యార్థులు..

ఇంటర్మీయట్ పరీక్షల దృష్ట్యా విద్యాశాఖ నిమిషం నిబంధన అమలు చేస్తోంది. విద్యార్థులు పరీక్ష సమయానికి అరగంటే ముందే తమ పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించింది. కానీ విద్యార్థులలో మాత్రం ఎలాంటి మార్పు కానరావడం లేదు. ఫలితంగా పరీక్ష కేంద్రాలకు సమయం దాటిన తర్వాతే చేరుకుంటున్నారు. అధికారులు చేసేదేమి లేక సమయానికి రాని విద్యార్థులకు పరీక్షలకు అనుమతించడం లేదు. గురువారం కొయ్యగుట్ట పరీక్ష కేంద్రానికి ఇద్దరు విద్యార్థులు పరీక్షా సమయం మించిన తర్వాత వచ్చారు. అక్కడి అధికారులు పరీక్షకు అనుమతించకపోవడంతో ఆ విద్యార్థులు అక్కడే కాసేపు నిరీక్షించారు. చేసేదేమిలేక నిరాశతో తిరుగుముఖం పట్టారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

బాన్సువాడటౌన్, ఫిబ్రవరి 29: బాన్సువాడ మున్సిపాలిటీకి చెందిన మరో ఇద్దరు కౌన్సిలర్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. 2 వ వార్డుకు చెందిన జర్పుల మోతీలాల్, 14వ వార్డుకు చెందిన నార్ల నందకిశోర్‌లు కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త మొహరిల్ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో బాన్సువాడ కాంగ్రెస్ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఏనుగు రవీందర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వీరిద్దరితో కలిపి ఆరుగురు కౌన్సిలర్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు.

జక్కాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నిజాంసాగర్, ఫిబ్రవరి 29: మండలంలోని జక్కాపూర్ గ్రామంలో గురువారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు నా యకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, సీఎం రేవంత్ రెడ్డి 6 గ్యారంటీలను తప్పక అమలు చేస్తారన్నారు. ఇప్పటికే 4 గ్యారంటీలను అమలు చేశారని తెలిపారు.

మొరార్జీ దేశాయ్ జయంతి వేడుకలు

బీర్కూర్, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దివంగత మాజీ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మొరార్జీ దేశాయ్ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్, విద్యార్థులు ఉన్నారు.

నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో

బీర్కూర్, ఫిబ్రవరి 29: మండల బైరాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని గురువారం ఎంపీడీవో భారతి పరిశీలించారు. ఏఏ మొక్కలు, ఎంత మేర పెంచుతున్నారు అనే వివరాలను జీపీ కార్యదర్శి సౌందర్యను అడిగి తెలుసుకున్నారు. మొక్కలకు సక్రమంగా నీరు అందించాలన్నారు. వర్షాకాలం నాటికి నాటేందుకు వీలుగా మొక్కలను సిద్ధం చేసి ఉంచాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులకు ప్రతిరోజు పౌష్టికాహారం అందించాలని సూచించారు. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు.

పెళ్లి వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 29: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కూతురు వివాహ మహోత్సవం గురువారం హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగిన వివాహానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

సదాశివనగర్, ఫిబ్రవరి 29: సదాశివనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీచేశారు. గ్రామా నికి చెందిన గాదరి రాజిరెడ్డి వారి తండ్రి పెద్ద రాజిరెడ్డి జ్ఞాపకార్థం 50 మంది విద్యార్థులకు అందించినట్లు ప్రధానోపాధ్యాయులు దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బసంత్‌రాజ్, శంకర్‌రెడ్డి,ప్రదీప్, శివనాగేశ్వరి, సంతోష్, సాధన, సునీత పాల్గొన్నారు.

'అమాయకులపై దాడులు చేయొద్దు'

భిక్కనూరు, ఫిబ్రవరి 29: గ్రామాల్లో కొత్తవ్యక్తులపై కిడ్నాపర్ల నెపంతో దాడులు చేయొద్దని ఎస్సై సాయికుమార్ అన్నారు. గురువారం భిక్కనూరులో సైబర్‌నేరాలు, డంకెన్ డ్రైవ్, తదితర అంశాలపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గుర్తతెలియని వ్యక్తులకు ఏటీఎం పీన్ నెంబర్, ఓటీపీ నెంబర్ చెప్పవద్దని ప్రతిఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై-2 రాంచర్‌నాయక్, ఏఎస్సై మల్లారెడ్డి, సిబ్బంది మదన్‌లాల్, శీరాం, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలకు గురికావొద్దు

దోమకొండ, ఫిబ్రవరి 29: ప్రజలు గుర్తు తెలియని వ్యక్తులకు ఏటీఎం పిన్ నంబర్, ఇతర వివరాలు చెప్పి ఆన్‌లైన్ మోసాలకు గురికావొద్దని ఏఎస్సై సుబ్రహ్మణ్యచారీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇండ్లలో సీసీ కెమోరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బ్యాంక్ అధికారులమని ఫోన్ చేసి బ్యాంక్ వివరాలను అడిగితే చెప్పవద్దని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్, చంద్రకాంత్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గురుకుల లెక్చరర్లుగా మహిళల ఎంపిక

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి: రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన తెలంగాణ సంక్షేమ గురుకుల లెక్చరర్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పెద్ద కొడప్‌గల్ మండలం నుంచి ఇద్దరు మహిళలు ఎంపిక అయ్యారు. వడ్లం గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి, పోచారం గ్రామానికి చెందిన హరితలు లెక్చరర్లు ఎంపిక అయినట్లు గ్రామస్థులు తెలిపారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

బీబీపేట, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలోని వరిపొలాలను ఏఈఓ రాఘవేంద్ర గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పంటలకు సంబంధించి పలు సూచనలు చేశారు. వాతావరణంలోని మార్పుల వల్ల వరి పంటలో ఆకు ఎండు తెగ్గులు ఏర్పడుతున్నాయని దీని నివారణకై స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 100 గ్రాములు లేదా వలిడామైసీన్ 3శాతం 500 మి.లీ ఎకరానికి చొప్పున పిచికారి చేయాలని అన్నారు. పోట్టదశలో ఉన్న పంటలకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 75శాతం ఎస్‌జీ 200 గ్రాములు పిచికారి చేసినట్లయితే తెల్లకంకి, మెడకాటు రోగాలను నివారించుకొని మంచి దిగుబడిన పెంచుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మద్నూర్: డోంగ్లీ మండలంలోని లింబూర్‌లో రైతులు సాగుచేస్తున్న యాసంగి కంది పంటలను మండల వ్యవసాయాధికారి రాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. యాసంగిలో కంది పంట వేయడం వల్ల రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందవచ్చని సూచించారు. వర్షాకాలం కంటే యాసంగిలో కంది పంట కాలం తగ్గి త్వరగా కోతకు వస్తుందని గుర్తు చేశారు. డిసెంబర్ నెలలో కంది పంట వేయడం వల్ల ప్రస్తుతం పూత, కాత దశలో ఉందని సూచించారు. మార్చి నెలలో పంట కోతకు వస్తుందని, ఎకరానికి 5 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్ల వరకు కంది దిగుబడి వస్తుందని సూచించారు. రైతులు పంటల మార్పిడీ కోసం వ్యవసాయ ఎఈవోల వద్ద సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు ఎఈవో నాందేవ్, రైతులు తదితరులున్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

మద్నూర్, ఫిబ్రవరి 29: డోంగ్లీ మండల కేంద్రంలో జొన్న పంట కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలని మండల రైతులు తహసీల్దార్ రేణుకకు వినతిపత్రం అందజేశారు. మద్నూర్ ఉమ్మడి మండలాల్లో ఈ యేడాది 1740 ఎకరాల్లో రైతులు జొన్న పంటను సాగు చేశారని, దీనికి గాను ప్రభుత్వం రూ. 3180 మద్దతు కల్పించిందని, మల్దండి జొన్నకు రూ. 3220 ధర కల్పించిందని, ఉమ్మడి మండలంలో మరో రెండు వారాల్లో రైతులు జొన్న కోతలు పూర్తయి పంట ఇంటికి వస్తుందని, అధికారులు, ప్రభుత్వం స్పందించి వెంటనే జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

ఆవాస ప్రాంత పాఠశాలను సందర్శించిన డీసీపీవో

రామారెడ్డి, ఫిబ్రవరి 29: మండలంలోని ఉప్పల్‌వాయిలోని ఇటుక బట్టి వద్ద ఏర్పాటుచేసిన ఆవాస ప్రాంత పాఠశాలను గురువారం డీసీపీఓ స్రవంతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు రావాలని తెలిపారు. పిల్లలతో పనిచేయిస్తే కఠినచర్యలు ఉంటాయని ఇటుకబట్టి యాజమానికి వివరించారు. పాఠశాల పనితీరు బాగుందని,పిల్లలకు పాఠ్యపుస్తకాలు అందించాలన్నారు. అలాగే ఐదు సంవత్సరాలలోపు ఉన్న పిల్లల వివరాలు తెలుసుకున్నారు.

'భిక్కనూరులో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నా'

భిక్కనూరు, ఫిబ్రవరి 29: భిక్కనూరులో పని చేయడం నా అదృష్టంగా భావిస్తున్న అని భిక్కనూరులో చాలాకాలం పాటు ఎంపీడీవోగా పనిచేసి ఇందల్‌వాయికి బదిలీపై వెళ్లిన అనంత్‌రావును అన్నారు. గురువారం అనంత్‌రావును భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. అనంతరం అనంత్ రావు మాట్లాడుతూ భిక్కనూరులో అన్నివర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, తమ సిబ్బంది తనకు ఎంతగానో సహకరించారని అన్నారు. ఈ మేరకు వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎంపీడీవో సంతోష్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ యాదగిరి, ఎంపీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు ఎల్లారెడ్డిలో విజయ సంకల్ప యాత్ర

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 29: భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్నటువంటి విజయ సంకల్ప యాత్ర శుక్రవారం ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలోనికి ప్రవేశించడం జరుగుతుందని జహీరాబాద్ పార్లమెంట్ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి తెలిపారు. ఎల్లారెడ్డి రామాలయం వద్ద స్వాగతం తెలిపి నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో యాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ ఉప అధ్యక్షురాలు డీకే అరుణ, అదే విధంగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకట రమణారెడ్డి విచ్చేస్తున్నారని తెలిపారు. ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సంబంధించిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ కో కన్వీనర్ కాసాల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఎంపీటీసీ మహిపాల్ యాదవ్, జిల్లా కార్యదర్శి హనుమాన్, సురేష్, మాజీ ఎంపీటీసీ చిరంజీవి, సీనియర్ నాయకులు పరందాములు, హఫీజ్ పటేల్, కాశీరాం, జైపాల్‌రెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్‌జీఎస్ కూలీలను పెంచాలి

రాజంపేట, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిసెంట్, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బందితో ఎంపీడీఓ రాజేశం సమావేశం నిర్వహించారు. ఎన్ఆర్‌జీఎస్ కూలీలను పెంచాలని, గ్రామాలలో నర్సరీలలో మొక్కలకు నీరు ఉదయం సాయంత్రం తప్పనిసరిగా నీరు అందించాలని తెలిపారు. గ్రామాలలో శానిటేషన్ సమస్య,తాగునీటి సమస్య రాకుండా చూడాలని అన్నారు. ఈనెల 3న పల్స్‌పోలియో కార్యక్రమం ప్రతి గ్రామపంచాయతీలలో జరపాలని తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రఘునాథం, టీఏలు భాస్కర్, రాజు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తవ్వకాలు

- జేసీబీ టిప్పర్‌లను జప్తు చేసిన అధికారులు

బీర్కూర్, ఫిబ్రవరి 29: మండలం అన్నారం గ్రామ శివారులో గత కొన్ని రోజులుగా అడ్డగోలుగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. మొరం టిప్పర్‌లలో లోడ్ చేసి దూర ప్రాంతాలకు తరలిస్తూ దర్జాగా విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదిలా ఉండగా గురువారం స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు తహసీల్దార్ లత, ఆర్‌ఐ సురేందర్‌రెడ్డిలు పోలీసులకు సమాచారం అందజేసి మొరం తవ్వకాలు చేపడుతున్న స్థలానికి చేరుకున్నారు. జేసీబీతో పాటు ఒక టిప్పర్‌ను అధికారులు జప్తు చేశారు. అనంతరం జేసీబీ, టిప్పర్‌లను పోలీసులకు అప్పగించారు. పోలీసులు జేసీబీ, టిప్పర్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వైభవంగా ఖండేరాయ మండాలమ్మ కల్యాణం

సదాశివనగర్, ఫిబ్రవరి 29: మండలంలోని ఉత్తునూర్‌లో శ్రీ ఖండేరాయ స్వామి, మండాలమ్మ కళ్యాణ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయం నుండి ఖండేరయ్యస్వామి, మండాలమ్మకు పట్టువస్త్రాలను ఊరేగింపుగా నిర్వహించి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన ముత్యాల పందిరిలో రాహుల్‌శర్మ, జంగంరాకేష్‌లు కళ్యాణం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కళ్యాణమహోత్సవానికి ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీనివాస్, వీడీసీ అధ్యక్షుడు రవి, సింగిల్‌విండో చైర్మన్ ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ మోతె సాయవ్వ రాములుపాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అన్నపూర్ణాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

- అమ్మవారికి దర్శించుకున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

బిచ్కుంద, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలోని కాశీవిశ్వనాథ్ శివాలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా అన్నపూర్ణాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనను సద్గురు బండాయప్ప మఠసంస్థాన్ మఠాధిపతి సోమలింగ శివాచార్యులు ప్రతిష్ఠించారు. గురువారం అన్నపూర్ణాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు గణపతి, నాగదేవత, నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠాపనతో పాటు కాశీ విశ్వనాథ్ శివాలయం ముందు అన్నపూర్ణా దేవి గుడి ముందు ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. విగ్రహాల ప్రతిష్ఠాపనకు మహిళలు గాజులు, పసుపు కుంకుమ ఇచ్చి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించా రు. మఠాధిపతి గురువులు బోధించిన విధంగా దైవమార్గాన్ని ఎంచుకుని నడుస్తూ చెడు వ్యసనాలు విడనాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర, కర్ణాటక ఆయా మఠాధిపతులు, గ్రామపెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అన్నపూర్ణా దేవి విగ్రహం

దోమకొండ ఎంపీడీవోగా రమేష్

దోమకొండ, ఫిబ్రవరి 29: దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీవోగా ఐ. రమేష్ బాధ్యతలు చేపట్టారు. పెదపల్లి జిల్లా నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన చిన్నారెడ్డి చేగుంటకు బదిలీపై వెళ్లారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - హనుమాన్
శాంతి - ఊరు పేరు బైరవకొన
ప్రియా 70 - ఈగల్
ప్రియా 35 - ఆపరేషన్ వాలెంటైన్

బాన్సువాడ

మహేశ్వరి - గుడాచారి 111
వెంకటేశ్వర - ఆపరేషన్ వాలెంటైన్



చికెన్ ధరలు

రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

